విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

నేడు పోలవరంలో సీపీఐ బహిరంగ సభ

విశాలాంధ్ర-ఏలూరు: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పోలవరం ప్రాజెక్టు తక్షణమే నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పోలవరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే బహిరంగ సభకు నిర్వాసితులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణతో పాటు సీపీఎం రాష్ట్ర నాయకులు పీ మధు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు ఎన్. తులసిరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు కందుల దుర్గేష్, మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్య, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఐ జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్, సీపీఐ, ప్రజాసంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటున్నారని కృష్ణ చైతన్య తెలిపారు. అలాగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జంగారెడ్డి గూడెం సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ రాజు విజ్ఞప్తి చేశారు.

కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు గొల్లగూడెం గ్రామంలో జరిగిన సభలో విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చింతలపూడి దుర్గారావు, ధగని వెంకటేశ్వరావు, ఎల్లిపో సుబ్బలక్ష్మి, చొక్కా బాలస్వామి, చొక్కా అలీసమ్మ, తుమ్మల వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దమనకాండ దారుణం: చెల్లబోయిన

విశాలాంధ్ర-భీమవరం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దమనకాండ దారుణమని తక్షణమే వాటిని అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్ దమనకాండను నిరసిస్తూ దళిత జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అంబేద్కర్‌చౌక్‌లో ఆందోళన చేపట్టి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. క్రైస్తవ నాయకులు గంటా రాజ్ కుమార్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, దళిత నాయకులు పాలపర్తి జోనా, మరపట్ల మునియ్య, గొల్ల రాజకుమార్ గూడపాటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫ్యాక్టరీకి అవార్డు హర్షణీయం

విశాలాంధ్ర-చాట్రాయి: శ్రీఫుడ్ ఫ్యాక్టరీకి అనతి కాలంలోనే జిల్లా స్థాయిలో బెస్ట్ అవార్డు రావడం ఆనందదాయకంగా ఉందని సంస్థ అధినేత అక్కినేని శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఆమె విశాలాంధ్రతో మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో యంత్ర పరికరాలు, అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్యమైన రుచికరమైన పిండి వంటలు తయారు చేసి వినియోగదారులకు అందిస్తుండటంతో ఇటీవల ప్రభుత్వ పరిశ్రమల శాఖ పరిశీలించి 5 జిల్లాల స్థాయిలో రాజమండ్రిలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి చేతుల మీదుగా ఏలూరు జిల్లా లోనే బెస్ట్ అవార్డు అందుకోవడం ఆనందదాయకంగా వుందన్నారు. పరిశ్రమల శాఖ, ప్రజల ప్రోత్సాహంతో మరింత ముందుకు తీసుకువెళ్లి రుచికరమైన వంటకాలను వినియోగదారులకు అందజేస్తామన్నారు.

డిగ్రీ ప్రవేశాల రిజిస్ట్రేషన్ గడువు పెంపు

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కొరకు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 24 నుండి జూలై నెల 5 వ తేది వరకు పొడిగించినట్లు, జూలై 7 నుండి 12 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలని, ప్రవేశాలు పొందినవారికి జులై 17నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం అవుతాయని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. గుత్తా గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం అమలౌతుందని, ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని పరిసర ప్రాంతాలలోని ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

శ్యామలాంబకు సారె

విశాలాంధ్ర -కైకలూరు: కైకలూరు గ్రామం లో వేంచేసి ఉన్నటువంటి శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానం నందు శ్రీమన్నారాయణ గోష్టి కైకలూరు శ్రీమతి చిట్టి హేమలత బృందం చే శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి, శ్రీ అమ్మవారికి ఆషాడ మాస సారే సమర్పించారు. ఈ సందర్భముగా ఆషాడ మాస సారే సమర్పించిన వారిని ఆలయ చైర్మన్లు గుర్రం రాంబాబు,ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ కార్యనిర్వహణాధికారి సిబ్బంది ఆహ్వానించి పూజ కార్యక్రమాలు జరిపించారని ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.ఎస్.కె.శేఖర్ ఒక ప్రకటనలో తెలియ చేశారు.

మానవత శాఖ నూతన అధ్యక్షులుగా రవి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం మానవత శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం సాయంత్రం 4.30 గంటలకు నారాయణపురం లైన్స్ క్లబ్ హాలులో జరుగుతుందని ప్రస్తుత అధ్యక్షులు సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. నూతన అధ్యక్షులుగా కైకరం గ్రామానికి చెందిన గంజి రవి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. నూతన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వారు కోరారు. రవి ప్రస్తుతం మానవతా శాఖ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మండల అధ్యక్షులుగా రవి నియమించడం పట్ల మండలంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కలెక్టరేట్లో స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం గం.10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం గం.10నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు.

అగ్గిపుల్లపై సీఎం ప్రతిబింబం

విశాలాంధ్ర-లింగపాలెం: అగ్గి పుల్లపై సీఎం జగన్ ప్రతిబింబాన్ని చిత్రీకరించి హోం మంత్రి తానేటి వనితకు బహుకరించారు. ఇండి యన్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన మేతర సురేష్ దీనిని రూపొం దించారు. రూపకర్తతో పాటు లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, లింగపాలెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ముళ్ళపూడి సుమన్, వైసీపీ నాయకులు నందిపాం ఏసురత్నం, కనకరాజు తదితరులు కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో హోం మంత్రిని కలిసి ప్రతిబింభాన్ని బహుకరించారు.

అమ్మవారికి ఆషాఢం కావిడి

విశాలాంధ్ర-పోడూరు: మండలం లోని పెనుమదంలో చల్లాలమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే నిమ్మల రామా నాయుడు ఆదివారం ఆషాడం కావి డిని మోసుకుని గుడికి తీసుకువెళ్లి ఇచ్చారు. అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు స్థానిక టీడీపీ నాయకులు దేవరపు దొరబాబు కొల్లు రామారావు ఆంజనేయులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

పంట మునిగింది పరిహారం ఇవ్వండి

విశాలాంధ్ర-పోడూరు: పంట ముని గింది పరిహారం ఇవ్వండిలో భాగంగా రెండోరోజు పోడూరు మండలంలోని అన్ని గ్రామాలలో రైతులకు జరిగిన నష్టాలను స్థానిక టీడీపీ నాయకులు నమోదు చేసు కోవడం జరిగింది. రావిపాడు, వద్ది పర్రు, పెనుమదంలలో జరిగిన నమోదు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు పాలకొల్లు నియోజకవర్గం పరిశీలకులు పెచ్చెటి చంద్రమౌళి పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్టు

విశాలాంధ్ర-టి నరసాపురం: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె సతీష్ కుమార్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మక్కినవారిగూడెం గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం తో ఆదివారం తన సిబ్బందితో దాడి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తుల నుండి రూ.3400/-ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

నకిలీ పోలీసుల అరెస్ట్

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఏలూరు రూరల్ పరిధిలో జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనదారులను ఆపి బెదిరింపులకు గురిచేసి నగదు అపహరిస్తున్న ఇద్దరు నకిలీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు డి.ఎస్.పి శ్రీనివాసులు తెలిపారు. ఏలూరులోని విశాఖపట్నం- విజయవాడ జాతీయ రహదారి నెం.16 పై ఈ నెల 23 రాత్రి సమయములో మోటార్ సైకిల్ పై ఎస్ఐ యూనిఫారం వేసుకుని వచ్చి పోలీసులమని చెప్పి చాకుతో బెదిరించి ఫిర్యాది వద్ద డబ్బులు తీసుకొని వెళ్లిపోయినట్లు రాబడిన ఫిర్యాదు పై ఏలూరు రూరల్ పోలీస్ వారు కేసు నమోదు చేశారు. నిందితులు పంపన మహేష్ (22), లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన నత్తా నాగేశ్వరరావు (40)ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి ఒక ద్విచక్ర వాహనం, యూనిఫారం, స్వాధీనం,2 సెల్ ఫోనులు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఈ సమావేశంలో డిఎస్ పి శ్రీనివాసులు సిఐ ఆది ప్రసాద్, రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ తప్పుడు ప్రచారం మానుకోవాలి

విశాలాంధ్ర-ఏలూరు: జూట్ మిల్ కార్మికులకు తీరని ద్రోహం తలపెట్టిన ఐఎఫ్‌టియు తప్పుడు ప్రచారం మానుకోవాలని జూట్ మిల్ కార్మిక సంఘాలు హెచ్చరిం చాయి. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాల యంలో విలేకరుల సమావేశం జరిగింది. టీఎన్‌టీయూసీ, జూట్ మిల్ యూనియన్ అధ్యక్షులు కోలాపల్లి ఉమాశంకర్(బుజ్జి) మాట్లాడుతూ 16 మాసాల క్రితం జూట్ మిల్లు నష్టాలు వస్తున్నాయనే సాకు చూపి మిల్లును అకారణంగా మూసివేశారని విమర్శించారు. అప్పట్లో జూట్ మిల్లు లోని 6 కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి ధర్నాలు,రాస్తా రాకో, వంటా వార్పులతో పాటు వివిధ రూపాలలో ఉద్యమాలు నిర్వహించాయని తెలిపారు. క్లాజ్ 19 అడ్డం పెట్టుకుని యాజమాన్యం ఏలూరు జూట్ మిల్లులో పనిచేస్తున్న 900 కార్మికులను కొత్తూరు జూట్ మిల్లుకు బదిలీ చేసిందని విమర్శించారు. ఐఎఫ్‌టియు దొడ్డిదారిన యాజమాన్యం తొత్తుగా వ్యవహరించి బదిలీలకు తాము అంగీకారం అని తెలుపుతూ సంతకం చేసి కార్మికుల కడుపు కొట్టిందని ఉమా శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని కార్మిక సంఘాల సమక్షంలోనే ఒప్పందం జరిగిందని, తామే ఒప్పందం చేసుకున్నట్లుగా ఐఎఫ్‌టీయూ చేసే ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఉద్యమానికి సహకారం అందించిన టిడిపి ఏలూరు నియోజక వర్గ ఇంచార్జ్ బడేటి చంటి, జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పల నాయుడుకు సీపీఐ, సిపిఎం, కాంగ్రెస్ ఇతర పార్టీలకు ప్రజా సంఘాలకు ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జూట్ లేబర్ యూనియన్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ నాయకులు పుప్పాల కన్నబాబు, టిఎన్ టియుసి, జూట్ మిల్ యూనియన్ కార్యదర్శి కే వెంకటేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి వి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంక్షేమానికి సహకరించాలి

విశాలాంధ్ర-భీమవరం: నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమానికి ప్రభుత్వం తమ వంతు సహకారం అందించాలని పశ్చిమగోదావరి జిల్లా నాయి బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ బంగారరావు, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం భీమవరంలో భీమవరం ప్రాంతీయ నాయి బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి బంగారరావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల అనేక సంక్షేమానికి, సామాజికంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పలు జీవోలు ప్రకటించడం పట్ల సమావేశం ఆయనకు అభినందనలు తెలిపింది. అనంతరం భీమవరం ఏరియా నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంస్కృతిక సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికయింది కమిటీ అధ్యక్షులుగా ఎం.శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులుగా జి.రమేష్, ఎం.భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు గా పి.వెంకటేశ్వరరావు, ఎ.పెద్దిరాజు, పెదపాటి రామకృష్ణ, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా అరటి కట్ల వెంకటేశ్వరరావు, పి.వి.వి.సత్యనారాయణ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భీమవరం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.రఘుబాబు, ఎస్.దుర్గారావు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ టి.వెంకటేశ్వరరావు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.వీర వెంకట సత్యనారాయణ, సిహెచ్ లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల పరిధిలో భీమవరం, వీరవాసరం, ఉండి ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు మండలాలకు చెందిన నాయి బ్రాహ్మణ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీల్లో సమావేశాలు

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం: ప్రధాన మంత్రి అవాస్ యోజన అర్బన్ స్కీమ్ ఏనిమిది ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జిల్లాలోని పలు యస్ టి కాలనీల్లో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించినట్టు జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇంచార్జి పిడి యస్.టి.వి రాజేశ్వరరావు తెలిపారు. ఆదివారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధి 11 వ వార్డు యస్ టి కాలనీలో ప్రధాన మంత్రి అవాస్ యోజన అర్బన్ స్కీమ్ ఏనిమిది ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ర్యాలీలు, సమావేశాలు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలల్లో గృహ నిర్మాణ శాఖ ఇ ఇ బి వెంకట రమణ, డి ఇ ఇ కె వి ప్రసాదు, ఏ ఇ టి వెంకటేశ్వర రావు, యస్ టి నాయకులు యం ఏడు కొండలు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు తది తరులు పాల్గొన్నారు. వివిధ మండలాలలో కూడా గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధంకండి

విశాలాంధ్ర-భీమవరంటౌన్: పశ్చిమగోదావరి జిల్లాలో 2010 విత్తనాలు సిద్ధంగా ఉంచామని వ్యవసాయ శాఖ అధికారి జడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలకరి జల్లులు పడటంతో పశ్చిమగోదావరి జిల్లాలో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారని, ప్రస్తుతం రైతులు నారుమడులు వేసే పనుల్లో ఉన్నారన్నారు. వరి విత్తనాలను నీటిలో నానబెట్టి రెండు రోజులు అనంతరం వాటిని చేలల్లో జల్లు కోవాలని తెలిపారు. అయితే ఖరీఫ్ సాగులో రైతులు ఏ విధంగా నారుమడులు వేయాలి, ఎప్పటిలోగా వేయాలి, వరినాట్లు ఎప్పుడు వేయాలని దానిపై విశాలాంధ్ర విలేఖరి పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావును కోరగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పంట నీరు కాలువలకు ముందుగా రావడంతో రైతులు త్వరగా నారుమడులు వేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటకు సంబంధించి పశ్చిమగోదావరి జిల్లాకు 25వేల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువుల అవసరం ఉందని, ఇప్పటికే 50 శాతం ఎరువులను రైతులకు అందుబాటులో ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు.కౌలు రైతులకు పశ్చిమ గోదావరి జిల్లాలో 57 వేల 500 కార్డులు ఇవ్వడానికి లక్ష్యంగా చేసుకున్నామని, ఇప్పటివరకు 20 వేల కార్డులను పంపిణీ చేయడం జరిగిందని వివరించారు.

జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: జలజీవన్ మిషన్ కార్యక్రమం కింద మంజూరైన పనులను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జలజీవన్ మిషన్, సత్యసాయి తాగునీరు ప్రాజెక్టు 2023-24లకు సంబంధించిన పనులు పురోగతిపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కొల్లేరు ప్రాంత వాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి, ప్రణా ళికను రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందుబాటులో తెచ్చే లక్ష్యంతో అమలవుతున్న జలజీవన్ మిషన్ పనుల లక్ష్యాన్ని పూర్తి చేయా లని అన్నారు. డిఎఫ్ఓ రవీంద్రనాథ్ థామస్ , ఆర్ డి బి ఎస్ ఎస్ సి సత్యనారాయణ, డిఆర్డిఏ పిడి విజయరాజు, డ్రామా పిడి రాము, ఏపీ ట్రాన్స్కో ఎస్సీ సాల్మన్ రాజు, ఐసిడిఎస్ పిడి పద్మావతి ఆశ పంచాయతీ రాజ్ ఎస్ ఇ చంద్రభాస్కర్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మానవత సేవలు మరింత విస్తృతం

విశాలాంధ్ర- తాడేపల్లి గూడెం: ప్రాంతీయ వర్గ విచక్షణ లేకుండా స్వచ్ఛంద సేవలను అంది స్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సంస్థ కేంద్ర కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ మర్చంట్ హాల్లో ఆదివారం జరిగిన మానవతా సంస్థ తాడే పల్లిగూడెం కమిటీ నూతన కార్యవర్గ అధ్యక్షునిగా సాధనాల త్రిమూర్తులు, కార్యదర్శిగా రాజన్ అరుమైనాథన్ తదితరులు ప్రమాణం చేశారు. మాన వతా సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు, నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. పూర్వ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి, చేకూరి బంగార రాజు, బీ సతీష్, కోశాధికారిగా ఏ ఆంజనేయ స్వామి, ఉపాధ్యక్షురాలిగా ధనలక్ష్మి, సహాయ కార్యదర్శిగా టీ చిన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం బాదంపూడి మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు. కైకరం గ్రామానికి చెందిన వెన్నెల కాశి ముత్యాలమ్మ గుడికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కాశీ తలకు తీవ్రంగా గాయపడ్డారు. అతనిని తొలుత తాడేపల్లిగూడెం అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. పూర్తి వివరాలు తెలియ రావాల్సి ఉంది.

భీమడోలులో వరినాట్లు ముమ్మరం

విశాలాంధ్ర-భీమడోలు: తొలకరి పలకరింపుతో భీమడోలు మండలంలో వరి సాగు కార్యక్రమం ముమ్మరమైంది. ఇంత వరకు వర్షాభావ పరిస్థి తులతో వ్యవసాయానికి సిద్ధమైన రైతులు తొలకరి వానలు ప్రారంభం కాగానే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతవరకు నారుమళ్ళను వేసిన రైతులు ఎండిపోతున్న పైరుకు తొలకరి వానలు ఊపిరి పోసాయంటున్నారు. మండలంలో మేలో గతేడాది 59.7 ఎంఎం వర్షపాతం నమోదు కాగా ప్రస్తుతం 36 ఎం.ఎం. నమోదైంది. జూన్ నెలలో గత సంవత్సరం 107.3 ఎంఎం నమోదు కాగా రెండు రోజులు వరకు క్రితం వరకు 4.40 ఎం.ఎం నమోదు కావడంతో రైతుల పనులను ముమ్మరం చేశారు.

మద్యం మత్తులో స్నేహితుని హత్య

విశాలాంధ్ర-తణుకు: ఇద్దరు స్నేహితుల మధ్య మద్యం మత్తులో జరిగిన ఘర్షణ ఒక యువకుడి హత్యకు దారితీసింది. తణుకు మండలం తేతలి పరిధిలో ఈ నెల 20న ఘటన జరగగా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన నల్లా జగతి కళ్యాణ్(18) హత్యకు గురయ్యాడు. తాడేపల్లిగూడెం పట్టణంలోని పాతూరుకు చెందిన కళ్యాణ్, అజయ్ స్నేహితులు కాగా వీరు ఈనెల 20న రాత్రి బైక్ పై తణుకు వెళ్లారు. మద్యం తాగి తిరిగి బైక్ పై వెళుతుండగా ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. కళ్యాణ్ తలపై కొట్టి గాయపరిచిన అజయ్ కళ్యాణ్‌తో పాటు బైక్ కాలువలోకి తోసి వేశాడు. కళ్యాణ్ ఆచూకీ కోసం గాలిస్తుండగా అజయ్ ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన తాడేపల్లిగూడెం పోలీసులకు అసలు వివరాలు బయటకు వచ్చాయి. నిందితుడు చెప్పిన వివరాల మేరకు పోలీసులు తణుకు మండలం తేతలి కాలువలో గాలింపు చేయగా కళ్యాణ్ మృతదేహంతో పాటు బైక్ ను వెలికి తీసారు. తణుకు రూరల్ సిఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: రౌడీ షీటర్లు ప్రవర్తన వెలగాలని ఎస్ ఐ చంటిబాబు సూచించారు. మండల పరిధిలోని రౌడీషీట్లు కలిగిన వారిపై మంచి ప్రవర్తన కలిగి ఉండుట కొరకు, గ్రామాల్లో వివాదస్పదమైన అంశాల జోలికి పోకుండా ఉండేందుకు, సత్ప్రవర్తన కలిగి ఉండేందుకు, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉండేందుకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ అనంతరం మంచి ప్రవర్తన కలిగి ఉండి గడచిన 7 సంవత్సరాలుగా ఎటువంటి వివాదాస్పద అంశాల జోలికి పోకుండా, ఎటువంటి నేర చరిత్ర లేకుండా, వయసు 60 సంవత్సరాలకు పైబడి, అనారోగ్య కారణములు చేత బాధపడేవారి వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి రౌడీషీట్లు క్లోజ్ చేస్తామని ఎస్ ఐ తెలిపారు.

టీడీపీ విజయానికి కృషి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి విజయకేతనం ఎగురవేయడానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా నియమిం పబడిన పోలవరం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి రాచూరు మదన్ పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన భవిష్యత్ గ్యారంటీ బస్సు రథయాత్ర కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుకు, మాజీ ఎంపీ మాగంటి బాబుకు, నియోజకవర్గ కన్వీనర్ బోరగం శ్రీనివాస్‌కు, మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్‌కు, పట్టణ అధ్యక్షులు జేష్ట రామకృష్ణకు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మదన్ తెలిపారు.

నగరంలో భారీ చోరీ

విశాలాంధ్ర-ఏలూరు: నగరంలోని శ్రీరామ్ నగర్ 9వ రోడ్డులో నివాసం ఉంటున్న నీలి దుర్గా వెంకట నాగేంద్ర రావు ఇంట్లో భారీ చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఈనెల 23వ తేదీ రాజమండ్రి వెళ్లి 24వ తేదీ ఇంటికి చేరుకునేసరికి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన నాగేందర్రావు ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులో ఉన్న 175 కాసులు బంగారం 750 గ్రాములు బంగారు అభరణాలు, 750 రూపాయలు చోరీ గురైనట్లు గుర్తించారు. నాగేంద్రరావు ఏలూరు 3వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి సిసిఎస్ సిఐ సిహెచ్ మురళీకృష్ణ,3,1వ సీఐలు వరప్రసాద్, ఆది ప్రసాద్,3వ ఎస్ఐ శంకర్ తన సిబ్బందితో చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఫింగర్ ప్రింట్స్ నిపుణులు, డాగ్ స్క్వాడ్ బృందం సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరిస్తున్నారు.

వేతనాలు విడుదల చేయాలి

విశాలాంధ్ర-ముసునూరు: ఉపాధి హామీ పథకం పనులు చేసిన ఉపాధీ కూలీలకు వెంటనే రోజు వారి వేతనం విడుదల చేయాలని సీపీఎం జిల్లా నాయకులు జి.రాజు పేర్కొన్నారు. పేద,మధ్యతరగతి కుటుంబాల వారికి ఆర్థికంగా బలోపేతం కావడానికి పార్లమెంట్‌లో సీపీఎం పోరాడి జాతీయ గ్రామీణ ఉపాధీహామి పథకం తీసుకురాగా, అప్పటి కాంగ్రెస్ కేంద్రప్రభుత్వం అమలు చేయగా, నేడు వున్న ప్రధాని నరేంద్రమోదీ ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. మండల నాయకులు పిల్లి మురళీ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-భీమడోలు: విధి నిర్వ హణలో క్షణం తిరిగి లేకుండా ఒత్తిడిలో ఉండే పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత గుండె వైద్య పరీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం భీమడోలు వీసీకన్వేషన్‌లో భీమడోలు సర్కిల్ పరిధిలోని ద్వారకాతిరుమల, భీమడోలు పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు రమేష్ హాస్పటల్స్ సౌజన్యంతో ఉచిత బీపీ, సుగర్, జనరల్ వీక్నెస్, గుండె పరీక్షా శిబిరాన్ని అధునాతన ఈసీజీ మెషిన్ సాయంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఎన్. భరత్ తేజ్, మేనేజర్ ఉమామహేశ్వరరాజు, పీఆర్వోలు రత్నబాబు, ఏసురాజు పాల్గొన్నారు.

అపహరణ కేసులో ముగ్గురి అరెస్టు

విశాలాంధ్ర-భీమడోలు: మైనర్ బాలిక అపహరణ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. ఎంఎంపురం గ్రామానికి చెందిన ఖండవల్లి అంబేద్కర్ అదే గ్రామానికి చెందిన మైనర్ బాలిక వెంటపడి తనను ప్రేమించేలా చేసుకుని ఇబ్బంది పెట్టడంతో మూడు నెలల క్రితం విషయాన్ని గుర్తించిన బాలిక తల్లిదండ్రులు అంబేద్కర్‌ను మందలించడంతో బాలిక జోలికి రానని హామీ ఇచ్చి కేసు పెట్టకుండా జాగ్రత్త పడ్డాడు. ఈనెల 20వ తేదీన అంబేద్కర్ అదే గ్రామానికి చెందిన తన సన్నిహితులైన బిరుదుగడ్డ నరేష్, వెంకటేశ్వరరావు సహకారంతో బాలిక ఇంటి నుండి రాజమండ్రి తీసుకుపోవడంతో బాలిక తల్లిదండ్రులు భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ చావా సురేష్ దర్యాప్తులో భాగంగా బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాధ్యులైన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర-కైకలూరు: కైకలూరు మండలం, భుజబలపట్నంలోని ఎస్సి కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం గ్రాంట్‌తో మంజూరైన సీసీ రోడ్ల పనులకు శంఖుస్థాపన కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. సర్పంచ్ గురజాల రామ తులసి, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, మండలం పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు,ఉప సర్పంచ్ జంగం మోషే, ఎంపీటీసీ పెన్మెత్స సూర్యనారాయణ రాజు, వాసవి రవిరాజు, మండల కో ఆప్షన్ సభ్యులు సోమల శ్యామ్ సుందర్, ఉచ్చుల యాబేల్ రాజు, మంతెన రామూర్తి రాజు, పరగర్ల సుబ్రహ్మణ్యం, దాసరి శ్యామ్ బాబు, నతనీలు, సుందర శ్రీను, విజయ రాము, పంచాయతీ రాజ్ డిఈ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మి నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-కైకలూరు: పట్టణంలో వెంచేసివున్నా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మ వారి క్షేత్రము నూతన పాలక మండలి(2023-25) సభ్యుల ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది.అధ్యక్షులు గా చొప్పెర్ల మురళి కృష్ణ,ప్రధాన కార్యదర్శిగా కొప్పర్తి గోపాలకృష్ణ మూర్తి, కోశాధికారి గా సమయమంతల బసవరాజు, సంయుక్త కార్యదర్శి గా వరదా మల్లి, ఆర్గనైజ్ సెక్రటరీ గా లక్కింశెట్టి రామ మోహన్ రావు మరియు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసినట్టు ఎలక్షన్ అధికారి గుర్రం శ్యామ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భముగా నూతనంగా ఎన్నికైనా సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. శ్యామలంబ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ గుర్రం రాంబాబు, పైడిమర్రి నరసింహారావు, కే.కే బాబు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు,తది తరులు పాల్గొన్నారు.